

సోమశిలలో 36.090 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 36.090 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 1100, ఉత్తర కాలువకు 175, దక్షిణ కాలువకు 20 క్యూసెక్కులు వదులుతున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.64,900
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,828
3శాతం జీఎస్టీతో	రూ.6,003
నవర (8గ్రా)	రూ.48,024

గరిష్ఠం/కనిష్ఠం
28.2 /21.5

వాతావరణం

శనివారం గాలిలో తేమ 63 శాతం ఉంది. ఉష్ణోగ్రత తక్కువగానే ఉంది. ఆదివారం కూడా మార్పులు ఉండకపోవచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిక్షణా తరగతులు



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి

వెంకటాచలం: వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, చెన్నైలోని రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మూడ్రోజుల పాటు నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 'త్రీ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ –ఎంగేజింగ్ యూత్' అనే అంశంపై మూడ్రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు వలంటీర్లకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. సామాజిక కార్యక్రమాల్లో ఆసక్తి చూపేలా యువతను ప్రోత్సహించాలన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపట్నంలో బరోడా విద్యార్థులు



ఆర్వో ప్లాంటు వివరాలు తెలుసుకుంటున్న బరోడా విద్యార్థులు

ముత్తుకూరు: గుజరాత్ రాష్ట్రానికి చెందిన ది మహారాజా సాయాజీ యూనివర్సిటీ ఆఫ్ బరోడా విద్యార్థులు ఆదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సీఎస్సార్ ప్రాజెక్టులను శనివారం సందర్శించారు. కృష్ణపట్నం గ్రామంలోని ఆర్వో ప్లాంటును సందర్శించి గ్రామస్తులకు తాగునీటి సరఫరాను పరిశీలించారు. కృష్ణపట్నం పోర్టులో పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను కూడా పరిశీలించారు. జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్‌రంజన్ తదితరులు విద్యార్థులకు వివరించారు.

బెస్ట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా నరేంద్రబాబు

నెల్లూరు (టౌన్): నగరంలోని బీవీనగర్‌లోని కేఎన్నార్ ఉన్నత పాఠశాలలోని పదో ఆంధ్రా నావెల్ యూనిట్ ఎన్‌సీసీ ఆఫీసర్ నరేంద్రబాబు బెస్ట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. పదో ఆంధ్రా నావెల్ యూనిట్‌లో విశిష్ట సేవలు అందించినందుకు గానూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ చంద్రశేఖర్ బెస్ట్ అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ అవార్డుకు ఎంపిక చేశారు. శనివారం నెల్లూరు పదో ఆంధ్రా ఎన్‌సీసీ నావల్ యూనిట్ లెఫ్టినెంట్ కమాండర్ వినయ్‌రామచంద్రన్ అవార్డు అందజేసి నరేంద్రబాబును అభినందించారు. ఈ సందర్భంగా నరేంద్రబాబుకు ఎన్‌సీసీ అధికారులు, ఉపాధ్యాయులు, క్యాడెట్లు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న నరేంద్రబాబు

ఆటాడుకుందాం రా



యోగాసన ప్రదర్శనతో ఆకట్టుకున్న క్రీడాకారులు

- ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు
- పండుగలా పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం
- క్రీడలపై అవగాహనకు రెండ్రోజుల ముందు నుంచే సంబరాలు
- జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన ముందస్తు క్రీడా వేడుకలు



స్టేడియం ఆవరణలో సెల్ఫీ బూత్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్



యోగాసనాలు ప్రదర్శిస్తున్న క్రీడాకారులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/ నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను పండుగలా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న క్రీడా పోటీలపై క్రీడాకారులకు అవగాహన కల్పించేందుకు రెండ్రోజుల ముందు నుంచే క్రీడా వేడుకలు ప్రారంభించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా క్రీడాపోటీలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లోనూ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా ముందస్తు వేడుకల్లో నగర కమిషనర్ వికాస్‌మర్మత్ పాల్గొని క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. ఈ నెల 26 నుంచి అట్టహాసంగా ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్రాను ఫిబ్రవరి 10వ తేదీ వరకు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 1.8 లక్షల మంది క్రీడాకారులు క్రీడల్లో పాల్గొనేందుకు రిజిస్టర్ నమోదు చేసుకున్నారు. ఇంకా స్థానిక సచివాలయాల్లో, 1902 కాల్ సెంటర్ ద్వారా పేర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 333 క్రీడా మైదానాలను క్రీడలకు అనువుగా సిద్ధం చేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటిన్, తదితర ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, నగదు పురస్కారాలు అందజేయనున్నారు.

పండుగలా పోటీల నిర్వహణ

జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా ముందస్తు వేడుకల్లో కమిషనర్ పాల్గొన్నారు. తొలుత స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన సెల్ఫీ బూత్‌ను ప్రారంభించి సెల్ఫీ దిగారు. అనంతరం విద్యార్థులతో కలిసి కమిషనర్, అధికారులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ఈ నెల 26 నుంచి శ్రీకారం చుట్టనుందని తెలిపారు. అందులో భాగంగా క్రీడాకారుల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా రెండు రోజుల పాటు ప్రారంభోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడాకారులు పెద్దఎత్తున ఆటల పోటీల్లో పాల్గొని క్రీడా ప్రతిభను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డీఈఓ గంగాభవాని, క్రీడల నిర్వహణ అధికారి యతిరాజ్, యోగా గురువులు స్వప్న, ప్రసూన, ప్రసన్నకుమార్, రమణయ్య, మున్సిపల్ అధికారులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి



రంగనాథస్వామి ప్రాకారోత్సవం

- వైష్ణవ ఆలయాల్లో శ్రీమహావిష్ణువుకు విశేష పూజలు
- ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన శ్రీవారు
- దర్శనానికి వేలాదిగా పోటెత్తిన భక్తులు
- గోవింద నామస్మరణతో పులకించిన క్షేత్రాలు





నెల్లూరులోని రంగనాథస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం బారులు తీరిన భక్తజనం, విశేషాలంకరణలో రంగనాథస్వామి

నెల్లూరు(బృందావనం): జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీమహావిష్ణువు వివిధ రూపాల్లో కొలువై ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వైకుంఠ ఏకాదశి నాడు శ్రీవారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే మోక్షం లభిస్తుందనే నమ్మకంతో భక్తులు వేకువజాము నుంచే వైష్ణవ ఆలయాలకు పోటెత్తారు. నెల్లూరులోని రంగనాయకులపేట రంగనాథస్వామి ఆలయం, మూలాపేటలోని రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి మందిరం, నెల్లూరు రూరల్ పరిధిలోని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కొండబిట్రగుంటలోని బిలకూటక్షేత్రం భక్తులతో కిటకిటలాడాయి. తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఉభయదేవేరులతో కలిసి సర్వాలంకార శోభితుడైన శ్రీవారు వేకువజామున 3.30 గంటలకు ఉత్తర ద్వారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. తొలుత శాస్త్రోక్తంగా ధనుర్మాసపూజలు నిర్వహించారు. అనంతరం ప్రాకారోత్సవం నిర్వహించారు. రంగనాథస్వామి మూలవర్లు పూలంగిసేవలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. దేవస్థానం ప్రాంగణంలో కొలువైన తాయార్లు, ఆండాళ్ తాయార్లు, ప్రసన్న వెంకటేశ్వర స్వామికి పూలంగిసేవ నయనానందకరంగా నిర్వహించారు. రంగనాథుడిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తజన గోవిందనామ స్మరణతో సింహపురి పులకించింది.

26న ఎస్పీడీసీఎల్ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ ట్రాన్స్‌కో ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించి నెల్లూరు సర్కిల్ జట్టుకు క్రీడాకారుల ఎంపికను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరుటౌన్ ఈఈ, జిల్లా స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ సోమశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఎంపికలకు ఆసక్తి కలిగిన విద్యుత్ సంస్థలో పనిచేసే క్రీడాకారులు డ్రెస్ కోడ్ పాటించి హాజరుకావాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిలా సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఆదివారం, క్రిస్మస్ సందర్భంగా సోమవారం సెలవుదినాలు అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చని ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తా యని చెప్పారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బిల్లులు చెల్లించాలని కోరారు.

రైతులకు అందుబాటులో సెంచరీ

- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి
- ప్యానెల్స్ తయారీకి జామాయిల్ కర్ర వినియోగం



సెంచరీ పరిశ్రమ ప్రారంభం సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు రూరల్: మర్రిపాడు మండల సరిహద్దు గ్రామమైన కదిరినాయుడుపల్లికి కేవలం 12 కిలోమీటర్ల దూరంలో వైఎస్సార్ జిల్లాలో గోపవరం పారిశ్రామిక పార్కులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం ప్రారంభమైన సెంచరీ ప్యానెల్స్ పరిశ్రమ జిల్లాలోని జామాయిల్ సాగు చేసే రైతులకు వరంగా మారనుంది. రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన ఈ పరిశ్రమ శరవేగంగా నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభించడంపై జామాయిల్ రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 2,500, పరోక్షంగా 5వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయి. అలాగే మరో 25 వేల రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటికే పరిశ్రమ పరిసరాల్లోని నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో గల రైతులకు చెందిన 80వేల ఎకరాల్లో జామాయిల్ చెట్ల పెంపకానికి సబ్సిడీ ధరపై 50 లక్షల జామాయిల్ మొక్కల పంపిణీని చేపట్టారు. రోజుకు 950 టన్నుల సామర్థ్యం గల ఎండీఎఫ్‌లు ఈ పరిశ్రమలో తయారు చేస్తారు. ఇందుకోసం భారీ సంఖ్యలో కలప అవసరం అవుతుంది. పరిశ్రమ కేంద్రానికి చుట్టు పక్కల 150 కిలోమీటర్ల పరిధిలో గల జిల్లాల నుంచి జామాయిల్ రైతులు తాము సాగు చేసిన ఉత్పత్తులను ఈ పరిశ్రమకు తరలించవచ్చు. ఇందుకోసం 80 వేల ఎకరాల్లో పంట సాగు కోసం ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు పరిశ్రమ జనరల్ మేనేజరు రమేష్‌రెడ్డి తెలిపారు.

నిరుద్యోగ యువతకు బంగారు భవిష్యత్

దివంగత పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి హయాంలో బద్వేల్ నియోజకవర్గంలోని గోపవరం వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన సెంచరీ ప్యానెల్స్ పరిశ్రమ ఆత్మకూరు నియోజకవర్గంలోని కనీసం 10వేల కుటుంబాల రైతులకు ప్రయోజనం చేకూరనుందని తెలుస్తోంది. 500 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఆత్మకూరు నియోజకవర్గం తరుపున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సెంచరీ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు మేకపాటి కార్యాలయ వర్గాలు తెలుపుతున్నాయి.

డిగ్రీ పరీక్షలకు 28 మంది గైర్హాజరు

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షకు 28 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి ఆర్ ప్రభాకర్ తెలిపారు. మొత్తం 313 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 285 మంది హాజరయ్యారని వివరించారు.

క్లుప్తంగా

తలసేమియా చిన్నారులకు ఉచితంగా పరీక్షలు



తలసేమియా చిన్నారికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన తలసేమియా బాధిత చిన్నారులకు హెచ్‌ఎల్‌ఏ(హ్యూమన్ ల్యూకోసైట్ యాంటిజన్స్) టెస్ట్‌ను నెల్లూరు రెడ్‌క్రాస్‌లో ఉచితంగా చేసినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని రెడ్‌క్రాస్‌లో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో తలసేమియా చిన్నారులకు మరో జన్మ పోస్టర్లను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం తలసేమియా చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తలసేమియా బాధిత చిన్నారుల కోసం రెడ్‌క్రాస్‌లో డే కేర్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తలసేమియా చిన్నారులకు అండగా ఉంటూ ఉచితంగా రక్తమార్పిడి, ముందులు, భోజనం, తదితర వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. తలసేమియా చిన్నారులు సాధారణ జీవితం గడిపేందుకు రూ.35 లక్షల ఖర్చు అయ్యే బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సను దాతల సహకారంతో ఉచితంగా చేయిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 300 మంది చిన్నారులు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. వారందరికీ రూ.25 వేలు ఖర్చు అయ్యే హెచ్‌ఎల్‌ఏ టైపింగ్ టెస్ట్‌ను ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ కన్వీనర్ సీత మాట్లాడుతూ 2017లో మాజీ గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా ఐదుగురు చిన్నారులతో తలసేమియా యూనిట్‌ను ప్రారంభించామని చెప్పారు. 2019 సంవత్సరానికి అది తలసేమియా మరియు హీమోఫిలియా ప్రాజెక్ట్‌గా రూపొంది 150 మంది పిల్లలకు 1500 యూనిట్ల రక్తాన్ని ఉచితంగా అందించిందని వివరించారు. రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు రవిప్రకాష్, దాసరి రాజేంద్రప్రసాద్, ప్రసాద్‌రెడ్డి, జనార్దన్‌రాజు, ప్రసన్నాంజనేయులు, శ్రీహరిరెడ్డి, తలసేమియా అడ్వైజర్ డాక్టర్ హరిత, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కావలి: పట్టణ పరిధిలోని ముసునూరు ఆటోనగర్‌లో శుక్రవారం జరిగిన హత్య కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ వెంకటరమణ శనివారం తెలిపారు. వివరాలు.. పుల్లా సుబ్బారెడ్డి అనే వ్యక్తి చీటీలు వేసి అప్పుల పాలయ్యాడు. ఈ నేపథ్యంలో సుబ్బారెడ్డి తన బంధువైన విజయారెడ్డితో కలిసి అప్పు ఇచ్చిన సురేష్‌ను కత్తితో దాడి చేసి హతమార్చినట్లు డీఎస్పీ చెప్పారు. ఈ కేసులో నిందితులైన సుబ్బారెడ్డి, అనూష, విజయారెడ్డి, సౌందర్య దంపతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అధ్యాపకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వేదాయపాళెం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఏపీపీఎస్సీ గ్రూప్–2 రిక్రూట్‌మెంట్ ప్రిలిమినరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి వై.వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేట్, కాంపిటేషన్ ఓరియంటెడ్ విధానంలో గ్రూప్–2 కు బోధన అనుభవం కలిగిన అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అధ్యాపకులు తమ అనుభవ ధ్రువీకరణ పత్రంతో పాటు బయోడేటాను ఆర్టీసీ సమీపంలోని మీ సేవ భవన్‌లో ఉన్న బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 9381554779, 9390239588 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నంద్యాల జిల్లా వృషభాలు ప్రథమ స్థానం



బేతంచెర్ల : మండ పరిధిలోని శ్రీ లక్ష్మీమద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం నిర్వహించిన న్యూకేటగిరి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పాణ్యం మండలం ఎస్ కొత్తూరుకు చెందిన సుబ్రహ్మణ్యేశ్వర్‌రెడ్డి వృషభాలు ప్రథమ, గుంటూరు జిల్లాకు చెందిన పులగం త్రిశజ్జరెడ్డి వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచాయి. తెలంగాణా రాష్ట్రం, గద్వాల జిల్లా చింతరేవులకు చెందిన అంజిగౌడు, కొచ్చెర్వు లక్ష్మీదేవి వృషభాలు తృతీయ, ప్రకాశం జిల్లా, కాజీపురానికి చెందిన సూరారెడ్డి వృషభాలు నాల్గోస్థానం కైవసం చేసుకున్నాయి. విజేత వృషభాల యాజమాన్యాలకు వరసగా రూ. 55 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు చొప్పున నగదు బహుమతులను ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడు చేతుల మీదుగా అందజేశారు.

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్- 109 లేయర్- 100
బ్రాయిలర్ చికెన్- 196
స్కిన్‌లెస్ చికెన్- 216
లేయర్ చికెన్- 170





గరుడ వాహనంపై ఉత్తర ద్వారంలో నేత్రపర్వంగా దర్శనమిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరుడు

ఉత్తర ద్వార దర్శనం..
సర్వపాప హరణం

- కొండబిట్రగుంటలో శాస్త్రోక్తంగా పూజలు
- గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన ప్రసన్నవేంకటేశ్వరస్వామి

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారదర్శన వేడుకను శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. చిద్విలాసుడు, నిత్యానందకారకుడు అయిన శ్రీవారిని ఉత్తర ద్వారంలో దర్శిస్తే సర్వపాపాలు తొలగి ముక్కోటి దేవతలు దీవిస్తారనే విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దట్టంగా కురుస్తున్న పొగమంచును, వణికిస్తున్న చలిని లెక్క చేయకుండా వాహనాల్లో తరలివచ్చిన భక్తులతో వేకువన నాలుగు గంటలకే ఆలయ ప్రాంగణంలో రద్దీ నెలకొంది. మోక్ష ప్రదాయమైన స్వామివారి దర్శనం కోసం భక్తులు ఉత్తర ద్వారమైన రాజగోపురం వద్ద బారులు తీరి గోవింద నామస్మరణలతో శ్రీహరికి మేలుకొలుపు పలికారు. భక్తుల కోరిక మన్నిస్తున్నట్లుగా నిత్యసుప్రభాత సేవలు పూర్తిచేసుకున్న స్వామివారు విష్ణుమూర్తి రూపంలో గరుడ వాహనంపై కొలువుదీరి ఉత్తర ద్వారానికి చేరుకున్నారు. ఆలయ అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించగా, అభయ ముద్రలో క్షేత్రవాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామి భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. ముక్కోటి దేవతలు హిమపాతం రూపంలో దీవెనలందిస్తుండగా, భక్తులు భక్తి పారవశ్యంతో గోవింద నామస్మరణలు చేశారు. ద్వారదర్శనం అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, కావలి శాసనసభ్యుడు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ ఉత్తర ద్వారదర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.



స్వామివారిని దర్శించుకున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి

కలెక్టరేట్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవ మత పెద్దలు, అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీస్ ఆర్థిక సంస్థ, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఆర్ కూర్మనాథ్, జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి నిర్మలాదేవి, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ షేక్ హైపా, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, క్రైస్తవ మత పెద్దలు ఇనయ్య డేవిడ్, దయాసాగర్ తదితరులు హాజరై కేక్‌ను కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలపించిన భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ హైటీ కార్యక్రమానికి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డ, హోసక్, క్రైస్తవ పెద్దలు జీ చంద్రశేఖర్, జోసెఫ్, రాయప్ప, స్వామిదాస్, నిర్మల్‌కుమార్, పలువురు పాస్టర్లు, క్రిస్టియన్ సోదరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి



క్రీడలను ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

- జెడ్పీ సీఈఓ చిరంజీవి

ఉదయగిరి: ఈనెల 26 నుంచి జరిగే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో 15ఏళ్లు పైబడిన వారందరూ పాల్గొనాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి అన్నారు. శనివారం ఆయన ఉదయగిరిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా అవగాహనా ర్యాలీలో పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గెలుపోటముల కంటే క్రీడల్లో పాల్గొనడమే ప్రధానమన్నారు. క్రీడాకారులతో పాటు, ప్రేక్షకులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సామ్రాజ్యం, ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ, ఈఓపీఆర్డీ ఎన్ మల్లికార్జున, ఈఓ నరసయ్య, ఎంఈఓ టీ శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీ ఓబుల్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎం రామాంజనేయులు, సర్పంచ్‌లు గౌస్‌మొహిద్దీన్, కె.వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నేషనల్ ఆర్బిటర్స్‌గా నెల్లూరీయులు



అబ్దుల్ అజీజ్ మంజుల జీ మౌనిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఈనెల 16, 17 తేదీలలో విజయనగరంలో ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్, ఆర్బిటర్స్ కమిషన్ తరపున ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించిన సీనియర్ నేషనల్ ఆర్బిటర్స్‌కు జిల్లా నుంచి ముగ్గురు ఎన్నికయ్యారు. సెమినార్, పరీక్షలో నెల్లూరుకు చెందిన వారు అర్హత సాధించి సీనియర్ నేషనల్ ఆర్బిటర్లుగా ఉత్తీర్ణులయ్యారని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీవీ శర్మ తెలిపారు. ఇంటర్నేషనల్ ఆర్బిటర్ స్వప్నిల్ బన్సద్ వీరికి రేటింగ్ రెగ్యులేషన్స్, టోర్నమెంట్ రెగ్యులేషన్స్, ఫెయిర్ ప్లే రెగ్యులేషన్స్, టై బ్రేకర్స్‌కు సంబంధించి సెమినార్ నిర్వహించారు. అందులో నెల్లూరుకు చెందిన ఏకైక ఫిడే ఇన్‌స్ట్రక్టర్ అబ్దుల్ అజీజ్, ఎస్ మంజుల, జి మౌనిక అర్హత సాధించి సీనియర్ నేషనల్ ఆర్బిటర్లుగా ఉత్తీర్ణులయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి 40 మందిని ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఎంపిక చేయగా, అందులో కేవలం 24 మంది అర్హత సాధించారు. నెల్లూరు నుంచి అర్హత సాధించిన ఈ ముగ్గురిని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీవీ శర్మ, సెక్రటరీ ఎస్ భీమారావు, ట్రెజరర్ కె.వి.జ్వాలాముఖి, నెల్లూరు చెస్ అసోసియేషన్ సెక్రటరీ మస్తాన్ బాబు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు సిటీ: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య హెచ్చరించారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ మీద స్కానింగ్ కేంద్రాల గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ చట్ట పరిధిలోనే స్కానింగ్ కేంద్రాలను నడుపుకోవాలని సూచించారు. సమాజంలో లింగ వివక్షత తగదని, స్త్రీపురుష నిష్పత్తి సమానంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి మాట్లాడుతూ ఆడపిల్లను బతికిద్దాం – ఆడపిల్లను చదివిద్దాం తద్వారా సమాజంలో స్త్రీ ఔన్నత్యాన్ని పెంచుదామని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజాత, దయాకర్, నవీన్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం

- ఆసుపత్రిలో చేర్చిన కుటుంబ సభ్యులు
- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శ్రీనివాసతేజ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఓ వైపు అనారోగ్యం, మరోవైపు ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... మూలాపేట బ్రాహ్మణవీధికి చెందిన శ్రీనివాసతేజ(33), వెంకటేశ్వరిలు దంపతులు. వారు 2017లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కుమారుడున్నారు. శ్రీనివాసతేజ నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో అనారోగ్యంతో నెల్లూరు నారాయణ హాస్పిటల్‌లో చికిత్స పొందారు. ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉండడంతో చెన్నైలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో చేరారు. ఎడమ వైపు నరాలు చిట్లిపోవడంతో మాట్లాడడం కష్టతరంగా మారింది. ఆస్పత్రిలో చూపించుకున్నా ఆరోగ్య పరిస్థితి కుదుట పడలేదు. ఓవైపు అనారోగ్యం, మరోవైపు ఆర్థిక ఇబ్బందులు అతనిని బాగా కుంగదీశాయి. ఈ నేపథ్యంలో తన తల్లి ముక్కోటి రోజు చనిపోయారని అదేరోజు తానూ చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 22న గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నానికి ఒడిగట్టాడు. ఇంట్లో అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాసతేజ నోట్లో నుంచి నురగలు రావడాన్ని గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు, అక్కడి నుంచి నారాయణ హాస్పిటల్‌కు, అక్కడి నుంచి జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసతేజ శనివారం మృతిచెందారు. మృతుని భార్య వెంకటేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని చిన్నబజారు ఎస్‌ఐ సైదులు తెలిపారు.